# ముఖ్యమంత్రి ప్రశ్న

చంద్రశేఖరానికి పాతికేళ్ళ సర్వీసు తర్వాత మొదటిసారిగా స్కూల్ ఫైనల్ పబ్లిక్ పరీక్షలకి, సాంఘిక శాస్త్రానికి పరీక్షా పత్రాన్ని సమకూర్చవలసిందిగా ఉత్తరువు వచ్చింది.

'మీకు ఎవరి సిఫారసు వల్ల ఈ అదృష్టం వచ్చిందో మర్చిపోకూడదు!' చంద్రశేఖరం భార్య పద్మావతి ఓసారి హెచ్చరించి తన పని చూసుకోసాగింది. చంద్ర శేఖరం తన కృతజ్ఞతని తెలుపుకోవడం కోసం, ఓ ప్రశ్న యిచ్చాడు.

మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి --

(ఎ) ఏ రెడ్డి (బి) బీ రావు (సి) సీ రయ్య (డి) డీ లయ్య.

ప్రశ్నాపత్రంలో సమాధానాలు కూడా యివ్వవలసిన బాధ్యత ఉంది కాబట్టి, సమాధానంగా 'ఎ' యిచ్చాడు.

పరీక్షలు జరుగుతున్నాయి; మర్నాడు సాంఘిక శాస్త్రం పరీక్ష అనగా, ఏ రెడ్డి మంత్రి వర్గం పడిపోయి, మరో మంత్రి వర్గం బీ రావు ముఖ్యమంత్రి అవడం జరిగింది.

సన్యాసిరాజుకి రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎవరో బాగా తెలుసు. రాష్ట్రంలో జరిగే ప్రతి ఉత్సవంలోనూ, ప్రతి ప్రారంభోత్సవంలోనూ పాల్గొనే ముఖ్యమంత్రి పేరు బాగా నలిగి ఉండడం వల్ల దర్జాగా, ధీమాగా 'ఎ' గుర్తుపెట్టాడు.

రామారావుకి ప్రతిరోజు రేడియో వినడం అలవాటు. వాళ్ల నాన్న - యింట్లో కుర్రాళ్లందరూ ప్రతి రోజు వార్తలు వింటే కాని ఊరుకోని యముడు కాబట్టి, రామారావుకి ఆ అలవాటయింది. మంత్రివర్గం మారిన సంగతి తెలుసును కాబట్టి ప్రశ్నకి సమాధానంగా 'బి' గుర్తు పెట్టాడు.

గుర్నాధం లాటరీల మీద, అంచనాల మీద నమ్మకమున్న వాడు. ఎప్పుడూ సినిమాల మీద, సిగరెట్ల మీద ధ్యాస ఉన్నవాడు కాబట్టి, రాష్ట్ర రాజకీయాలు అసలే తెలియని వాడు కాబట్టి యిరుకులో పడిపోయాడు. అసలు రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎవరో తెలియదు. ఒక్కసారి తల పంకించి 'సి' గుర్తు పెట్టేశాడు.

వీర్రాజుకి చెమటలు పట్టేశాయి. దేశానికి ప్రధానమంత్రి, రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఉంటారని కూడా తెలియని అజ్ఞాని కాని, దేముడి మీద నమ్మకమున్నవాడు. అంచేత దైవం మీద భారం వేసి 'డి' గుర్తు పెట్టాడు.

శోభనాద్రికి నిజంగా సమాధానం తెలియదు. ఏదో తప్పు వ్రాసి పాసు మార్కు పోగొట్టుకోవడం యిష్టం లేని పొదుపరీ, పిరికివాడు కాబట్టీ, ఆ ప్రశ్న వదిలేశాడు.

పేపర్లన్నీ రీ నంబరింగ్ అయిన తర్వాత దిద్దడం కోసం ఎగ్జామినర్లకి పంపబడ్డాయి. అయితే ఆయారామ్- గయారామ్‌ల ప్రభావం వల్ల బీరావు మంత్రివర్గం మారిపోయి,

సీరయ్య ముఖ్యమంత్రి అయి కూర్చున్నాడు.

పరమేశం ముక్కుకు సూటిగా పోయే మనిషి. ప్రశ్నాపత్రంతో పాటు యిచ్చిన సమాధానాలు పక్కన పెట్టుకొని తనకొచ్చిన పేపర్లన్నీ టకటకా దిద్ది పారేశాడు. ముఖ్య మంత్రి 'ఎ' అన్న వాళ్ళందరికీ రైట్లిచ్చేసి, యితర సమాధానాలు కొట్టి పారేశాడు.

రాజగోపాలం తెలివైన టీచరు. ముఖ్యమంత్రి ప్రశ్న దగ్గరకొచ్చేసరికి ఆలోచనలో పడిపోయాడు. పాత న్యూస్ పేపర్లు తీసి, పరీక్ష జరిగే రోజు నాటికి, 'బి' ముఖ్యమంత్రిగా ఉన్నాడని నిర్ధారణ చేసుకొని, 'బి' రాసిన వాళ్లందరికీ రైటు పెట్టి, మిగిలిన సమాధానాలకి సున్న చుట్టేశాడు.

ప్రకాశరావు ప్రస్తుతానికి ప్రాధాన్యత యిచ్చే స్వభావం కలవాడు. అతని దృష్టిలో ప్రస్తుతం అందరి నోళ్లలో నలుగుతున్న సీరయ్య ముఖ్యమంత్రి. అయితే 'ఎ'కి, 'సి'కి మధ్య 'బి' వో వెలుగు వెలిగించాడని తెలియనివాడు. 'సి' సమాధానం వ్రాసిన వాళ్ళందరికీ మార్కులిచ్చేసి, మిగిలిన సమాధానాల్ని తప్పు పెట్టేశాడు.

పేపర్లు రీవాల్యుయేషన్ కోసం వచ్చినప్పుడు, మూడు విధాలుగా దిద్దబడిన ఈ ప్రశ్న ఆందోళన లేవదీసింది. ప్రధాన పరీక్షాధికారి రాష్ట్ర విద్యాసంస్థకి సలహా కోసం ఉత్తరం వ్రాశాడు. కాని ఆ సమయానికి అనుకోని అవాంతరాల వల్ల సీరయ్య పడిపోవడం డీలయ్య ముఖ్యమంత్రి కావడం జరిగిపోయింది. 'మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి డీలయ్య గారని మీకు తెలియకపోవడం చాలా విచారకరమైన సంగతి' అంటూ సంస్థ అధికారి గోడ మీది పిల్లి వాటంగా వ్రాసి పంపించేశాడు - డీలయ్యగారి మంత్రివర్గంలోని కొత్త విద్యా మంత్రికి కోపం రాని విధంగా.

పరీక్షాధికారి ఒక నిర్ణయానికి వచ్చేశాడు. 'ముఖ్యమంత్రి ప్రశ్నకు ఎ, బి, సి, డిలలో దేన్ని గుర్తుపెట్టినా మార్కులు యిచ్చేయండి. ఆ ప్రశ్న రాయనివారికి కూడా ఒక మార్కు యిచ్చేయండి. ఎందుకంటే అది చాలా చిక్కు ప్రశ్న. గజిబిజి ప్రశ్న. ఆ ప్రశ్న బదులు మరో ప్రశ్న ఉంటే విద్యార్థులకి న్యాయం కలిగేది' అని రీవాల్యుయేషన్ బోర్డుకి సలహా యిచ్చాడు.

ఈ ముఖ్యమంత్రి ప్రశ్న- అన్ని సబ్జెక్టులలోనూ మంచి మార్కులు తెచ్చుకున్న వారికి ఏమీ సహాయం చెయ్యలేదు. ఈ ఒక్క మార్కు వల్లా సాంఘిక శాస్త్రంలో ప్యాసయినా, మిగిలిన సబ్జెక్టులలో మార్కులు తక్కువ వచ్చిన వారికి సహాయకారి కాలేదు. అయితే మిగతా అన్నిటిలో పాసుమార్కులొచ్చేసి, సాంఘిక శాస్త్రంలో ఒక మార్కు తక్కువొచ్చి, నట్టేట్లో కొట్టుకుపోవడానికి సిద్ధంగా ఉన్న ఓ పదకొండు వందల మందిని గట్టెక్కించేసి, కాలేజీలలో సీట్ల కోసమో, పొట్ట గడవడానికి ఉద్యోగాల కోసమో, పాట్లు పడేటట్లు చేసింది.

*(మన దేశ, రాష్ట్రాల రాజకీయాలాధారంగా......- రచయిత)*

*(ఆంధ్ర సచిత్ర వార పత్రిక : 8-10-1971)*